క్లుప్తంగా

నియామకం



వెంకటాపురం(కె): భద్రాచలం నియోజకవర్గం కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మండలానికి చెందిన రావుల నరేంద్రను నియమించారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి చైర్మన్ వీరయ్య చేతుల మీదుగ గురువారం నియామక పత్రం తీసుకున్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించాలి



ములుగు రూరల్: బీజేపీ బలపర్చిన టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన సరోత్తంరెడ్డికి టీచర్స్ వారి మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సూర్యాదేవర విశ్వనాథ్, కార్యాలయం కార్యదర్శి దొంతిరెడ్డి రవిరెడ్డి, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మమన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ అర్చకుడు యల్లాప్రగడ భానుప్రకాష్‌శర్మకు ఇటీవల తెలుగు వెలుగు సాహితీ వేదిక నంది పురస్కారాల అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం సాయిబాబా ఆలయంలో భానుప్రకాష్‌శర్మను ఆర్యవైశ్య సంఘం సభ్యులు సన్మానించారు. మండల అధ్యక్షుడు బచ్చు సతీష్, గంజి రమేష్, గుంత రమేష్, గంజి స్వామి, బచ్చు సత్యనారాయణ, వెలగందుల మాదవ్, నూక ప్రభాకర్, గౌరిశంకర్ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

వాజేడు: మండల పరిధిలోని పేరూరు గ్రామంలో పోలీసులు గురువారం 18 లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం పేరూరు గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా పక్కా సమాచార మేరకు అదే గ్రామానికి అరికిల్ల ప్రశాంత్ ఇంటి పరిసరాలలో 18 లీటర్ల గుడుంబాను గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సైతో పాటు హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్, సాంబమూర్తి, కానిస్టేబుల్ సత్యాన్వేష్, హోమ్ గార్డ్ ఆనంద్ ఉన్నారు.

ఆర్థిక సాయం



వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన సుగందపు భిక్షపతి అనారోగ్యంతో బారిన పడడమే కాకుండా ఇటీ తల్లిని కూడా కోల్పోయి మానసికంగా బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు ముడిగె తిరుపతి, స్వప్న, కవిత, కల్లూరి సతీష్, చోడ రాంబాబు, గారపాటి సతీష్, షేక్ తాజుద్దీన్ రూ.10000 ఆర్థిక సాయం అందించారు.

క్షమాపణ చెప్పాలి

మంగపేట: రెడ్డి సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వెంటనే క్షమాపణ చెప్పాలని రెడ్డి సంఘం జిల్లా అధక్షుడు మసిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ గర్జన సభలో తీన్మార్ మల్లన్న మాట్లాడిన విదానం సమాజంలోని రెడ్ల మనోభావాలను దెబ్బతీశాయన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన పదజాలంతో మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా వెంటనే తప్పు తెలుసుకుని రెడ్డి సామాజిక వర్గానికి క్షమాపణ చెప్పాలన్నారు.

పత్తి కొనుగోలు చేయాలి

ములుగు రూరల్: సీసీఐ ద్వారా పత్తిని ఈనెల చివరి వరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కన్వీనర్ అమ్జద్‌పాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాటన్ మిల్లుల వద్ద మిల్లు యజమానులు పక్క జిల్లాలో సీసీఐ కొనుగోలు అయిపోయిందని అనడం వలన రైతులు అభద్రత భావానికి గురవుతున్నారని తెలిపారు. కాటన్ కార్పొరేషన్ అధికారులు, ప్రభుత్వ అధికారులు ములుగు మార్కెట్ కార్యదర్శి ఫిబ్రవరి నెల వరకు ఉంటుందని ప్రకటన ద్వారా తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నర్సయ్య, లావణ్య, రామన్న పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు పక్కదారి!

- పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు
- బదిలీలు, సస్పెన్షన్‌తో సరి

మంగపేట: మండలంలో 25 గ్రామ పంచాయతీల్లో 2011 నుంచి పరిపాలన స్పెషలాఫీసర్, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో కొనసాగుతొంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు కూడా నిలిచిపోవడంతో మండలంలో స్థానిక ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో పంచాయతీల పరిపాలనలో పంచాయతీ అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అక్రమ ఆర్జనే ధ్యేయంగా పనిచేస్తు పంచాయతీ అభివృద్ధి నిధులను దిగమింగుతున్నారని ప్రజలు మండి పడుతున్నారు. పలు గ్రామపంచాయతీల నిధులు పక్కదారి పడుతున్నాయని అయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు వసూలు చేస్తున్న ఇంటి పన్ను, పలు వ్యాపార వాణిజ్య సంస్థల లైసెన్సు ఫీజు సంబంధిత రికార్డుల్లో నమోదు చేసి ఎస్టీఓలో జమచేయాలనే నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు పంచాయతీ కార్యదర్శులు సొంతానికి వాడుకుంటున్నట్లు సమాచారం.



బుచ్చంపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

అక్రమ సంపాదనకు కేరాఫ్ మంగపేట

పలు శాఖలకు చెందిన పలువురు మండల స్థాయి అధికారులకు, కొందరు జిల్లా స్థాయి అధికారులకు అక్రమ సంపాదనలో మంగపేట కేరాఫ్ అని ప్రచారంలో ఉంది. సర్పంచ్‌లు లేకపోవడంతో గడిచిన 13 ఏళ్ల కాలంలో ఆడిందే ఆట పాడిందే పాట అన్నచందంగా వ్యవహరించిన 08 మంది పంచాయతీ కార్యదర్శులు, ముగ్గురు ఈఓ పీఆర్‌డీలు కోట్ల రూపాలయ పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురయ్యారు. అలాగే ఈఓపీఆర్‌డీ అదనపు బాధ్యతలు తీసుకున్న పంచాయతీ కార్యదర్శి డబ్బులు వసులు చేస్తున్నారనే ఆరోపణతో బదిలీపై వెళ్లారు. కాగా, పంచాయతీ నిధులు దుర్వినియోగం అయిన సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు నిధుల రికవరీ లేక పోగా సస్పెన్షన్‌కు గురైన అధికారులు ఇతర ప్రాంతాల్లో మళ్లీ ఉద్యోగంలో చేరడం గమనార్హం.

అయినా అదే తంతు

అధికారుల సస్పెండ్ అయినా కూడా మండలంలోని గ్రామ పంచాయతీల పరిపాలన, నిధుల వినియోగంలో సంబంధిత అధికారుల్లో ఏమాత్రం మార్పు లేదని అయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ స్పెషలాఫీసర్లు ఎప్పుడో ఒకసారి అలా వచ్చి ఇలా వెళ్తుంటారని, పంచాయతీ కార్యదర్శులు సైతం అదే తీరుగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బాలన్నగూడెం, మల్లూరు, నర్సాయిగూడెం గ్రామ పంచాయతీలలో నిధులు దుర్వినియోగం అయిన విషయం వెలుగులోకి వచ్చింది. విషయంపై ఎంపీఓ మమత ఆయా పంచాయతీల రికార్డులను పరిశీలించి నిధుల దుర్వినియోగంపై సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. దీంతో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఒకరిద్దరు పంచాయతీ కార్యదర్శులు రెండు రోజుల క్రితం కొంత నగదును ఎస్టీఓలో జమచేయడం గమనార్హం. ఇదే విధంగా మండలంలోని మరో 10 గ్రామ పంచాయతీలలో ఇదే పరిస్థితి నెలకొందని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల దరఖాస్తుల సర్వే సమయంలో కొందరు పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను, ఇంటినంబర్ రిజిస్ట్రేషన్ పేరుతో గ్రామాల్లో లక్షల రూపాయలు వసూళ్లు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. విషయంపై వెంటనే కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి స్పందించి పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్న పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ చేస్తున్నాం..



మండలంలోని మల్లూరు, బుచ్చంపేట, బాలన్నగూడెం గ్రామ పంచాయతీలలో నిధుల దుర్వినియోగం జరిగాయనే ఆరోపణపై విచారణ ప్రారంభించాం. బుచ్చంపేట పంచాయతీల కార్యాలయంలో రికార్డులను పరిశీలించాం. అదే విధంగా బాలన్నగూడెం, మల్లూరు నిధుల విషయంలో పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తాం.

– మమత, ఎంపీఓ మంగపేట

నివేదిక ఆధారంగా చర్యలు



గ్రామపంచాయతీల నిధుల దుర్వినియోగం జరిగిన విషయం తన దృష్టికి రాలేదు. ఎవరైనా నిధుల దుర్వినియోగానికి పాల్పడితే ఉపేక్షించేది లేదు. దుర్వినియోగం జరిగిన విషయంపై మండల పంచాయతీ అధికారి విచారణ నివేదిక వచ్చిన వెంటనే నివేదిక ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– దేవరాజ్, జిల్లా పంచాయతీ అధికారి

సేఫ్టీ మోకులతో రక్షణ

- బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి రవీందర్‌రెడ్డి

ఏటూరునాగారం: సేఫ్టీ మోకులతోనే గీత కార్మికులకు రక్షణ ఉంటుందని బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి రవీందర్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్సై వీరస్వామి అన్నారు. మండల కేంద్రంలోని గీత కార్మికులకు గురువారం కాటమయ్య కిట్ అందజేశారు. అనంతరం ట్రైనర్స్ సేఫ్టీ మోకులతో తాటిచెట్టు ఎక్కడంపై గీత కార్మికులకు ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాటిచెట్లు ఎక్కడం ప్రమాదకరమైన వృత్తి అన్నారు. గీత కార్మికులు అనేక మంది ప్రమాదాల బారిన పడకుండా ప్రభుత్వం అందజేస్తున్న కాటమయ్య కిట్‌ను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ కాటమయ్య కిట్లను ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ వాసులనే తేడా లేకుండా ప్రతీ గీత కార్మికుడికి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ గుండెబోయిన రవి, రంగు సత్యనారాయణ, పులి రమేష్, గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చిక్క అశోక్, గౌడ సంఘం సొసైటీ అధ్యక్షులు తాళ్లపల్లి నరేందర్ గౌడ్, రేణుక ఎల్లమ్మ గుడి చైర్మన్ గడ్డం రాజమౌళి, సప్పిడి రాంనర్సయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గడ్డం వినయ్, గడ్డం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సేఫ్టీ మోకుల పై శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు

విద్యుత్ వైర్లు అమర్చితే చర్యలు

- ఎస్సై తిరుపతి రావు

వెంకటాపురం(కె): అడవి జంతువుల కోసం విద్యుత్ వైర్లను అమర్చితే చట్ట పరంగా కఠిన చర్యలను తీసుకుంటామని ఎస్సై కొప్పుల తిరుపతిరావు అన్నారు. మండల పరిధిలోని మహితాపురం గ్రామంలో ఉన్న కార్డన్ సెర్చ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అడవి జంతువును వేటాడే ఉద్దేశ్యంతో, పంట చేలను కాపాడుకునే క్రమంలో విద్యుత్ వైర్లు అమర్చవద్దన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై తిరుపతి రావు

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

- ఎస్ఓ సురేష్‌బాబు


ఏటూరునాగారం: స్వయం ఉపాధితోనే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఐటీడీఏ స్టాటస్టికల్ అధికారి(ఎస్ఓ) సురేష్‌బాబు, మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ హసన్‌పర్తి ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా ఆదేశాల మేరకు గిరిజన మహిళలకు జూట్ బ్యాగుల శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు ఆ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఐటీడీఏ ద్వారా వైటీసీ భవనం ఇవ్వడం జరిగిందని, ఎస్‌బీఐ ఆర్ ఎస్‌ఈటీఐ వారు భోజన వసతి, శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. 13 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. గిరిజన మహిళలకు జూట్ బ్యాగుల తయారీపై జేఆర్‌పీల ద్వారా అవగాహన కల్పించి అనంతరం వీరికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అలాగే ఉపాధి కల్పించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. 35 మంది వరకు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్ ఎస్‌ఈటీఐ డైరెక్టర్ బాస రవి, ఫ్యాకల్టీ పరికి కిషోర్, ట్రైనర్ తాడు, జేఆర్‌పీ భిక్షపతి, గిరిజన మహిళలు పాల్గొన్నారు.



జూట్ బ్యాగుల శిక్షణను పరిశీలిస్తున్న అధికారులు

కేంద్ర బడ్జెట్ కాపీల దహనం

ఏటూరునాగారం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి నిధులు కేటాయింపు లేకపోవడంతో గురువారం మండల కేంద్రంలో బస్టాండ్ ప్రాంతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బడ్జెట్ కాపీలను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రజాసంఘాల పోరాటవేదిక కన్వీనర్ దావూద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీకి చెందిన 8 మంది పార్లమెంట్ సభ్యులు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా ప్రయోజనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జిల్లా, మండల నాయకులు యాకూబ్, బండారి నర్సింహులు, బోట కృష్ణ, నాయిని కృష్ణ, బాలు, గణేష్, ధనుష్, చలపతి పాల్గొన్నారు.



పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

పర్యావరణ పరిరక్షణకు కృషి

రేగొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి అన్నారు. గురువారం మండలం కేంద్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ కార్యక్రమాలు నిర్వహించారు. రేగొండ ఏఎస్సై ప్రభాకర్, ఉపాధ్యాయులు సంధ్యారాణి, దేవేందర్, శ్యామ్‌సురేందర్ రెడ్డి ఉన్నారు.

సమ్మక్క–సారలమ్మ జాతర ప్రారంభం



అమ్మవార్లను తీసుకొస్తున్న పూజారులు

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని ఫ్రూట్ గ్రామంలో సమ్మక్క సారలమ్మ తల్లుల జాతర ప్రారంభమైంది. గురువారం తల్లులు గద్దెల వద్ద కొలువుదీరడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా, అవాంచనీయ సంఘటనలు జరగకుండా పస్రా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.


ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): కేంద్ర బడ్జెట్‌లో రూ.12 లక్షల ఆదాయం ఉన్న వారికి ఎలాంటి పన్ను లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌తో పాటు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు పైడాకుల మల్లేష్ మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కారుపోతుల యాదగిరి, పత్తి నాగేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, వీరేందర్, సంతోష్, సురేష్, వీరస్వామి, రాందాస్ పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటానికి..



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంగణంలో కాంగ్రెస్ మండల నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి సీతక్క చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. మాదిగల పోరాటాన్ని గుర్తించి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలిపిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఒకరికి గాయాలు



వాజేడు: మండల పరిధిలోని అరుణాచలపురం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏటూరునాగారం మండలం వైపు నుంచి వెంకటాపురం(కె) మండలం వైపు వెళ్తుండగా మరమ్మతులకు గురైన రహదారిలో తేలిన చిప్స్‌పై ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న సీఐ కు మా ర్ బాధితుడిని 108 అంబులెన్స్‌లో వెంకటాపురం(కె) వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం వ్యక్తి ఆరోగ్యంగానే ఉన్నట్లు సమాచారం. గా యపడిన వ్యక్తి పేరు ఉమ్మడి రాజు గా తెలిసింది. హెల్మెట్ ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలుపుతున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలంలో గత నెల 23న ఇల్లు రాలేదని పురుగులమందు తాగి చికిత్స పొందుతూ చనిపోయిన నాగేశ్వర్‌రావు కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. గురువారం నాగేశ్వర్‌రావు కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరి నాగేశ్వర్‌రావు అనే రైతు గ్రామ సభలో ఇందిరమ్మ ఇంటి లిస్ట్‌లో పేరు రాలేదని ఆవేదనకు లోనై పురుగుల మందు తాగినట్లు తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించినప్పటికీ నయం కాలేదన్నారు. అనంతరం ఎంజీఎంకు తరలించగా మృతి చెందడని తెలిపారు. కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ప్రదీప్‌రావు, రఘు, నాయకులు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద సుదర్శన్‌రెడ్డి, నాయకులు

కుటుంబానికి అండగా బీఆర్‌ఎస్

నాగేశ్వర్‌రావు కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, తాడ్వాయి మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాగేశ్వర్‌రావు ఎంజీఎంలో మృతి చెందగా అతడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి



కన్నాయిగూడెం: మాట్లాడుతున్న రామరాజు నేత



ఏటూరునాగారం: మాట్లాడుతున్న జనార్దన్

- బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు నేత

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంలో ఇందిరమ్మ ఇల్లు రాలేదని గ్రామ సభలోనే పుగుల మందు తాగి చికిత్స పొందతూ మృతి చెందిన నాగేశ్వర్‌రావు మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు నేత అన్నారు. మండలంలోని బుట్టాయిగూడెంలో బీజేపీ మండల అధ్యక్షురాలు దుర్గం సమ్మక్క అధ్యక్షతన సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏటూరునాగారం: బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన రైతు కుమ్మరి నాగేశ్వర్‌రావు మృతి ప్రభుత్వ హత్యనే అని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అబద్దాలుగామారినవి అన్నారు. బాధిత కుటుంబానికి రూ.30లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి, సత్యం, రాజశేఖర్, సంపత్, శ్రీనివాస్, రవి, రాజు, వెంకన్న పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- మాజీ సర్పంచ్ నర్సయ్య

ఎస్ఎస్‌తాడ్వాయి: కష్టపడి చదివి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ సర్పంచ్ నర్సయ్య అన్నారు. మండలంలోని కాటాపూర్‌లోని జెడ్పీ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఎన్నారై పులి రవిగౌడ్ అందజేసిన ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను ఆయన సోదరుడు మాజీ సర్పంచ్ పులి నర్సయ్య గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.15వేల విలువ చేసే ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను 30 మంది విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నారై పులి రవిగౌడ్‌కు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సక్రునాయక్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవంలాల్, సమ్మయ్య, సుతారి పాపారావు, రాజేష్ ,జయపాల్ వెంకటేశ్వర్లు, సాంసన్, మోహన్, పీడీ విజయ, శ్రీదేవి పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న నర్సయ్య

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని జిల్లా కాలనీ, టేకులబోరు, మంగవాయి, ముక్కునూరు పాలెం, రామచంద్రాపురం, మొర్రవాని గూడెం, ఆలుబాక, బర్లె బొంద, ఎదిర గ్రామాల్లో గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం 800 మంది పేద విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. సంస్థ యజమాన్య సభ్యులు మురళీకృష్ణారెడ్డి, సతీష్, ముర్రం రాజేష్, అంజనేయులు తదితరులు ఉన్నారు.

వాజేడు: మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం పేద విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. సంస్థ యజమాన్య సభ్యులు మురళీ రెడ్డి చేతుల మీదుగా 63 మందికి వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో కంతి శ్యామ్ నవీన్ తదితరులు ఉన్నారు.



వెంకటాపురం(కె): దుస్తులు పంపిణీ చేస్తున్న సభ్యులు

బొడ్రాయి ప్రతిష్ఠాపన హోమం



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

వాజేడు: మండల పరిధిలోని అయ్యవారిపేట గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం సందర్భంగా గురువారం హోమం నిర్వహించారు. పూజారులు అత్తులూరి బాలచంద్ర శాస్త్రి, రంగు రవీంద్ర చారి ఆధ్వర్యంలో ఉదయం హోమం నిర్వహించి దేవతా మూర్తులను గ్రామంలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నేడు(శుక్రవారం) విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.